# నరకానికి పొలిమేరలు

(గత సంచిక తరువాయి)

అర్థరాత్రప్పుడు సరస్వతికి ప్రసవవేదన ప్రారంభమైనది. రాజారావు అప్పటిదాకా చదివి అప్పుడే పండుకున్నాడు. సుందర్రావుకి భయం వేసింది. తనకెవరూ లేరు. ఏకాకి. అనూహ్యమైన పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. తన ఇంటి దగ్గరైతే తనకీ బాధలన్నీ వుండేవా? "రాజా-రాజా!" రాజారావుని లేపాడు. అతడు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. "సరస్వతి నొప్పులు పడుతోందిరా! మంత్రసాన్నెవరైనా పిలుచుకు రావాలి. డబ్బుందా-ఇంకా చాలావాటి కవసరం గూడా?" అన్నాడు.

రాజారావు "పరీక్షఫీజు కట్టడానికి మాత్రం వుంది. సరేలే ఏంచేస్తాం" అంటూ పెట్లోనుంచి డబ్బుతీసిచ్చాడు. సుందర్రావు హృదయం రాజారావు పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

"మరి పరీక్షఫీజు ఎట్లా?"

"నాన్నకి ఏదోవిధంగా ఉత్తరంరాసి తెప్పించాలి" అన్నాడు. రాజారావే వెళ్ళి మంత్రసాన్ని పిలుచుకొచ్చాడు. సరస్వతి సుఖప్రసవమే అయింది. సరస్వతికి బాలింతరాలు ఎలా ఉండాలోనన్న విషయం తెలిసినట్లు లేదు. తనకంతకంటె తెలీదు. ప్రతీదీ ఓ సమస్యయిపోయింది. బలహీనతకి ఏవన్నా టానిక్కులిప్పించాలి. ఎట్లా? ఇప్పటికే రాజారావుకి బోలెడు ఋణపడి వున్నాడు తాను. ఇక ఏవిధంగానూ ఉద్యోగాన్వేషణలో అలస్యం చెయ్యడానికి వీల్లేదు. ఇప్పుడు ఇద్దరేగాదు. ముగ్గురయ్యారు. ఏకొద్ది గుమాస్తాగిరీ దొరికినా చాలు అసలు లేనిదానికంటె.

రెండోరోజు ఆయిల్ కంపెనీ మానేజరు కొడుకు తనతో చదువుకున్నతన్ని కలుసుకున్నాడు. "మీ నాన్న పనిచేస్తున్న కంపెనీలో ఏదైనా వేకెన్సీ..." అన్నాడు.

"వేకెన్సస్ ఎలావుంటాయోయ్. కావాలంటే ఏ చిన్న గుమాస్తాగిరో దొరకచ్చుగాని నెలకు ఏభై రూపాయలు. నువ్వేలా చేస్తావోయ్?" అన్నాడు.

సుందర్రావుకదే గొప్పగా కన్పించింది. "అదయినాసరే. తప్పకుండా వచ్చేటట్లు చూడు" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"సరే! చూస్తాను" అన్నాడతను. ఓ వారం తర్వాత తనకి కంపెనీలో గుమాస్తా ఉద్యోగం దొరికింది. జీతం నలభైఎనిమిది రూపాయలు. ఏదో గుడ్డిలో మెల్ల. అసలు అదంటూ దొరికినందుకు సంతోషించాడు.

క్రొత్తబట్టలు కుట్టించుకున్నాడు. సరస్వతికీ కొన్నాడు. రాజారావు పరీక్షలు అయిపోయాయి.

సుందర్రావుకి క్రొత్త ప్రశ్న ఒకటి ఎదురైంది. రాజారావు వెళ్ళిపోతే ఎలా గడుస్తుంది. తనకొచ్చే డబ్బులో ఇంటి అద్దె ఎంతిస్తాడు? తనేంతింటాడు?

"వచ్చే సంవత్సరం గూడా ఇక్కడేగా? సెలవుల్లో ఇక్కడే వుండకూడదూ?" అన్నాడు.

"ఆఁ ఎందుకులే!" అన్నాడు రాజారావు.

"ఇంతవరకూ నువ్వు లెక్కకుమించిన సహాయం చేశావు. కాని ఇంకా కొద్దికాలంగూడా కష్టమనుకోను. బ్రతికి బావుంటే నీ ఋణం తీర్చుకోలేకపోను. నువ్వెళ్ళిపోతే ఇంతఖర్చు నేభరాయించగలనా?" అన్నాడు. రాజారావు ఒప్పుకోక తప్పలేదు.

పిల్ల పెద్దదవుతున్నకొద్దీ ఖర్చు ఎక్కువవుతోంది. రాజారావునాన్న సెలవుల్లోగూడా అంత డబ్బు ఎందుకు? అని చీవాట్లు పెడుతూ తక్కువ డబ్బు పంపుతున్నాడు. ఇంటి అద్దె కట్టడం దుర్భరంగా వుంది. "ఇంత ఇల్లు అవసరంగూడా లేదు ఇంకోఇల్లు మారుద్దాం" అన్నాడు రాజారావు.

"తిరునగర్"

రెండుగదులున్న ఇల్లొకటి దొరికింది చివరికెలాగో. ఉన్నకొద్దీ జీవితం జీమూతం కాసాగింది. సంసారబంధాలు ఒక్కొక్కటే బిగుసుకొంటున్నాయి. తనకిరవై రెండేళ్ళు లేవు అప్పుడే పిల్లా, జల్లా. తను ఏ సుఖం ఆశించి ఇంత క్లిష్ట పరిస్థితులికి సిద్ధపడ్డాడో ఆ సుఖంలో ఆనందం లేదిప్పుడు. జీవితం ఓ మరలా తయారైంది. దానికి కష్టాలూ, సుఖాలూ అవసరంలేదు. గుడ్డెద్దు గానుగ లాగినట్లు.

తను ప్రొద్దున తొమ్మిది గంటలకి టిఫిన్ కారియరు తీసుకొని ఆఫీసుకెళతాడు. తిరిగి వచ్చేసరికి రాత్రి ఏడుగంటలవుతుంది. రాజారావు ఇంటిదగ్గర వుండబట్టిగాని లేకపోతే తను ఆఫీసుకెళ్ళటానికి కూడా వీలుండేదికాదు.

ఇల్లు చాలా ఇరుకు. రెండేగదులు. ముందు గదిలో రాజారావు చదువుకుంటాడు. రెండో గదిలో రెండుమంచాలు పట్టాలి. హైన్యమంతా కళ్ళకు కట్టినట్లుంటుంది. రాజారావు పాపం బయటికి రావడానికి సిగ్గుపడతాడు రాత్రిపూట.

ఆవాళ తను భోజనం చేసింతరువాత మంచం మీద కూర్చున్నాడు.

"మనం ఇక్కణ్ణించి వెళ్ళిపోదాం" అంది సరస్వతి.

"ఎక్కడికి" అన్నాడు తను ఆశ్చర్యపడి.

"మీరు తెచ్చే డబ్బుతోనే ఎలాగో కాలం గడుపుకుందాం. ఈ యింట్లో క్షణంగూడా వుండలేం" అంది.

"ఏం?" అన్నాడు సుందర్రావు. సరస్వతి ఏడ్వసాగింది. ఆమె ఎందుకలా ఏడుస్తుందో అతనికి అర్థంకాలేదు. ఆమెను లాలించి "అసలువిషయం చెప్పు" అన్నాడు.

"మీ స్నేహితుడు రాజాదావు ప్రవర్తన రెండుమూడురోజుల్నించీ విపరీతంగావుంటోంది" అంది సరస్వతి.

"ఏం ఏం ఏమన్నాడు?" ఆదుర్దాగా అడిగాడు.

"ఏమీ అనలేదు. ఇదివరకులేని చనువు ఇప్పుడు తీసుకుంటున్నాడు. నాకేమిటో భయంగానే వుంది" అంది సరస్వతి.

ఆమె సంఘంలో మెలగలేదు. రాజారావు చదువుకున్నవాడు. అదీగాక నిత్యసన్నిహితత్వం అంతమాత్రం చనువును ప్రోత్సహించదా? "పిచ్చిదానా! నువ్వూరికే ఖంగారుపడ్డావు. కాని రాజారావులో ఏ కల్మషంలేదు. అది అతనికి అలవాటు" అన్నాడు. సరస్వతి మళ్ళా మాట్లాళ్ళేదు. సుందర్రావు ఆ విషయం రాజారావుని అడగదగ్గంత ముఖ్యంగా తీసుకోలేదు. అదీగాక తనకోసం అంత త్యాగంచేసిన రాజారావు బాధపడవచ్చుగూడా.

ఆ నెల పదిహేనురోజులికే జీతమైపోయింది. "ఎలా గడుస్తుంది మిగిలిన నెల?" అనుకోగానే ఎందుచేతో ఒక్కసారిగా వదిన గుర్తుకొచ్చింది. "చిన్నచిన్న అప్పులుగూడా పెరిగాయి. ఒక్క వందరూపాయలుంటే పంపించ వలసిందని" ఉత్తరం రాశాడు తన పరిస్థితినంతా ఏకరువు పెడుతూ. నాలుగురోజులు వదినదగ్గిర్నించి మనీయార్డరు వస్తుందని ఎదురుచూచాడు. కాని లాభంలేకపోయింది.

ఆవాళ పెందరాళే పని తెమిలింది. ఆకలిగా గూడా వుంది. గబగబా ఇంటికివెళ్ళాడు. రాజారావు తలుపుదగ్గరికి వేసివుంది. తలుపు తోసి చూశాడు, రాజారావు గదిలో లేడు.

కొన్ని నిమిషాల తరువాత చెప్పులువేసుకొని బయటికి బయలుదేరాడు సుందర్రావు.

"ఎక్కడికి?" అంది సరస్వతి.

"ఇప్పుడేవస్తా. రాజా... అలా వెళదాం ఒక్కసారి వస్తావా?" అన్నాడు.

రాజారావు తలపంచుకొని వెంటనడిచాడు. సముద్రందగ్గరికెళ్ళేదాకా ఎవ్వరూ మాట్లాడలేదు. ఎవరిమనస్సూ ఆలోచనారహితంగాలేదు. సముద్రమథనం జరుగుతోంది. సముద్రందగ్గరికి వెళ్ళాక రోడ్డుదిగి ఇసుకలో నడిచి ఒకచోట "ఇలా కూర్చుందాం" అన్నాడు సుందర్రావు. రాజారావు చతికిలపడ్డాడు. రాజారావు సుందర్రావు ముఖం చూడ్డానికి సిగ్గుపడుతున్నాడు.

సముద్రం ఘోష భయంకరంగా వినిపిస్తోంది. చూపుమేర దూరంలో తీరంలో ఎక్కడా మనుషుల్లేరు. చీకట్లో సముద్రం దూరాన అలలనురుగు తెల్లగా కన్పిస్తోంది. సుందర్రావు ఒక్కసారి ఆలోచించుకున్నాడు. తను చేసిన సంఘ సంస్కరణ ఏమిటో తనకర్థంకాలేదు. తన ఆశయం ఏమిటి?

ఎంతవరకు నెరవేరింది? తను ఉద్ధరించి సమాజానికేదో ఆదర్శమార్గం చూపిద్దామనుకున్నాడే? ఆ ఆదర్శమార్గం ఏది? అన్నయ్యచెప్పినట్లు యువకత్వంలో మన నిర్ణయాలకు విలువల్లేవుగాబోలు. తను వూహించిందంతా పుస్తకాల్లో చదివిన సారాంశఫలితం! అది ఒక్క పుస్తకాల్లో తప్ప వాస్తవికతలో లేనిది.

సరస్వతి తప్పేముంది ఇందులో-తనతో ముందే చెప్పింది రాజారావు ప్రవర్తన విపరీతంగా వుందని. తనే ఉపేక్ష చేశాడు. రాజారావుమీద దోషం ఆరోపిద్దామన్నా అంతకంటె వీల్లేదు. అతనుమాత్రం ప్రకృతి అంశలనించి మినహాయింపు కాదుగా! దీంట్లో తప్పెవరిదీ కాదు. తలవంచుకుని ఆలోచిస్తున్న రాజారావునుద్దేశించి—

“నువ్వెందుకిలా చేశావని అడుగుతాననుకుంటున్నావా?” అన్నాడు సుందర్రావు.

రాజారావు సుందర్రావుని కౌగలించుకున్నాడు. అతని కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు కారుతూ సుందర్రావు భుజాన్ని తడుపుతున్నాయి. రాజారావు చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నాడు.

“క్షమించగలవటరా సుందరం! నేనీవిధంగా చెయ్యకుండావుండాలని విశ్వప్రయత్నం చేశాను”

సుందర్రావు వీపు తట్టాడు. “నువ్వేకాదులేరా రాజా! బుద్ధుడే నీస్థానంలోవున్నా అలాగే చేసేవాడేమో లే! ఇక వెళదామా?” అన్నాడు.

ఇంటికి వెళ్ళేసరికి సరస్వతి పాపను కావులించుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది. సుందర్రావు తనకువేసిన మంచంమీద పండుకున్నాడు. తెల్లవార్లూ ఆ ముగ్గురిలో ఎవ్వరూ నిద్రపోలేదు. నిద్రపోతున్నట్లు నటించారు ప్రతివారూను. తెల్లవారింది. సుందర్రావులో మార్పు ఈషన్మాత్రమైనా రాజారావుగ్గాని సరస్వతిగ్గాని కనిపించలేదు. దైనికచర్యలన్నీ రోజులకుమల్లేనే జరిగిపోయాయి. సుందర్రావు ఆఫీసుకు వెళ్ళకముందే రాజారావు ఇంట్లోంచి ఎక్కడికో వెళ్ళిపోయాడు. సుందర్రావు ఆఫీసుకు వెళ్ళి డెస్కుదగ్గర కూర్చున్నాడన్న మాటేగాని మనస్సు బావుండలేదు. ఆలోచనలు మిడతల దండులా దాడి చేస్తున్నాయి మెదడుమీదికి. తనకెందుకింత బాధ అవ్యక్తంగా పీడిస్తోంది? రాత్రి రాజారావుదగ్గర తనెంతో విశాలహృదయుడుగా ప్రవర్తించాడే? అది వట్టినటన. జలసీ మానవుల్లోనించి ఎక్కడికిపోతుంది. విశాలహృదయం, త్యాగం అవన్నీ వట్టి నటనమాత్రమే! పాపం రాజారావు చేసిన సహాయం ముందు ఇదెంత తప్పు? తాను జన్మలో అతని ఋణం తీర్చుకోగలడా? కాని జలసీ ముందు అవన్నీ ఏమీ పనిచెయ్యవు.

సరస్వతిలో తప్పులేదనీ తెలుసు-రాజారావులోనూ తప్పులేదని తెలుసు. ఆ జ్ఞానంవున్నప్పుడు తనలో ఇంకా జలసీ తలెత్తడానికి అవకాశం ఎక్కడుంది? కాని తనలో జలసీ వుంది. తను సంస్కారం పేరు పెట్టుకొని అణుచుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడు. దాచుకుని తనలో జలసీలేదని ఇతరులనుకోవాలనుకుంటున్నాడు.

తను సరస్వతిని ప్రేమించాననుకున్నాడు. ఇప్పుడాలోచిస్తే తనకు పొరపాటు పడ్డానేమోననిపిస్తోంది. ప్రేమకు సరైన అర్థం తనకానాడు తెలీలేదు. తను కీర్తికాముకు. సంఘంలో ఓ ప్రత్యేకస్థానం, ఇతరులకంటె భిన్నమైనదీ, వాళ్ళకులేనిదీ తను సంపాదించాలని కోరిక. దానికి ఆదర్శమని పేరు పెట్టుకున్నాడు. అది సాధించడానికి సరస్వతిని ఊతగా తీసుకున్నాడు. సంఘం ఎవరికీ బాధ కలిగించదు—దాన్ని తలుచుకొని భయపడేవాళ్ళకు తప్ప.

“మీపేర ఉత్తరం ఒకటుందండీ” అంటూ జవాను సూరయ్య తెచ్చి ఓ కవరిచ్చిపోయాడు. అది అన్నయ్య వ్రాసిందే!

* * *

సుందరం!

మళ్ళా చాలాకాలానికి మన బాంధవ్యాన్ని గుర్తుచెయ్యవలసిన అవసరం కలిగింది. ఈ అవకాశం తప్పకుండా వస్తుందనే విషయం నాకు ముందే తెలుసు. పాపం నువ్వు మీవదినకు రాసే వుత్తరాలన్నీ నేను చదువుతూనే వున్నాను. నువ్వుపడే బాధలు నేనూహించిందానికంటె ఎక్కువేమీ కాదు.

నువ్వు మూడురోజుల క్రితం మీ వదినకు పరిస్థితులన్నీ విశదపర్చి రాస్తూ వేసినవుత్తరం అందింది. నీకు ఓ అమ్మాయికూడా నటగా? ఆ అమ్మాయి జీవితం ఏమౌతుందో కాస్త యోచించావా?

నీవంటి సంస్కర్త ఎవరవా, వ్వుంటే తప్ప ఈ పిల్ల జీవితం వృధాయేనా?

వచ్చే యాభైరూపాయలతో సంసారం గడవటం లేదన్నావు. నిజమే! ఈ రోజుల్లో పట్నములో ఇద్దరు మనుషులు యాభైరూపాయలతో బ్రతుకుతున్నారంటే కష్టమంతా అనుభవిస్తున్నారని అర్థం! నీ స్వశక్తిమీద నీకు నమ్మకమున్నదని నాతో ఆ రోజున, అన్నమాటలు మర్చిపోయావా? నీ స్వశక్తి ఏమైందో ఆలోచించడానికి రెండునిమిషాలు ప్రయత్నం చెయ్యి.

నిన్ను చూస్తూంటే నాకు జాలేస్తుంది సుందరం! నిన్నేమిటి ప్రస్తుతం యువకులంతా నీమాదిరే! పుస్తకాలు చదివి వాటిని నమ్మి, ఆదర్శమని సంఘోద్ధరణని పాపం జీవితాల్ని నాశనం చేసుకుంటారు. వాస్తవిక ప్రపంచంలోకివచ్చి క్రొత్తగా కళ్లు తెరిచేసరికి తాము కట్టుకున్న సౌధాలన్నీ పేకముక్కల్లా కూలిపోయి, కాలప్రవాహపు అడుగునపడి కొట్టుకుపోతారు.

జీవితమంత వాస్తవికమైనది ప్రపంచంలో మరోటిలేదు. అది ఎప్పుడూ ఓ కథలా పూర్తి కాదు. ముగింపు చిందరవందరగా వుంటుంది. జీవితం ఓ కథలా ముగిస్తే జీవితాన్ని గురించి ఇంత భయపడే అవసరం వుండేదికాదేమో! నీకు పుస్తకజ్ఞానం తప్ప-లోకజ్ఞానం తక్కువ. అనుభవంలేని ఆదర్శభావాలున్నవి. అవి వాస్తవంలో ఎండమావులు-అందుకోలేని ఆనందపు టంచులు-అధిరోహించలేని హిమాలయ శిఖరాగ్రాలు.

“సంఘం - సంఘం” అంటావు. మండిపడతావు. అదంటే నీ కెందుకోపం! నీవంటివాళ్లు పదిమంది కలిస్తేనేనా సమాజమంటూ ఏర్పడింది. నీవు దాంట్లో సాధారణసభ్యుడివి. నీఉద్రేకంలో నీక్కావాలి గనుక యుగయుగాలుగా పాతుకుపోయి, ఘనీభవించి వున్న సాంఘికవ్యవస్థను ఢీకొని కదిలిస్తానంటే వృధాప్రయాసేగాకుండా వచ్చేనష్టం చాలావుంటుంది.

సంఘం-దాని కట్టుబాట్లు, అది బిగించుకున్న తాళ్ళూ, వేసుకున్న గొలుసులూ బిగిసిపోయి యుగాలుగడిచింది. అది సంఘం తప్పుగా ఎంచం! అసలా గొలుసులు, దానికి వేసిందెవరు? మనం; దాన్ని బంధించింది మనం! అది బిగవటమనేది సహజప్రక్రియ. “ఎందుకంత కఠినంగావున్నావు” అని ప్రశ్నిస్తే “దానికి కారణం నువ్వేను” అంటుంది. అది అతిక్రమిస్తానంటే, నాకేమీ అభ్యంతరంలేదు. కాకపోతే సభ్యత్వం వదులుకోమంటుంది. మానవులు సంఘానికి అలవాటుపడ్డ జంతువులు. నియమాలు కఠినంగా వున్నాయని బాధపడ్డా అవతలికి వెళ్ళి బ్రతకలేరు. ఆ విషయం సంఘానికి తెలుసు గనకనే అంత ధీమాగా “నీఇష్టం” అంటుందేమో. నిర్ణయించుకోవలసింది మనం!

ఏమీ తెలియని అమాయకుడిలా పదిమంది కన్నుల్లోనూ పడకుండా ఏమూలో సుఖంగా జీవించగలిగిన వాడే లౌక్యుడు. దాన్నెదిరిస్తే నవ్వవాడికని ఆరోగతే! నీ ఆదర్శాలన్నీ నీటిపై అలల్లాంటివి వాటికి నిర్దుష్టమైన విలువల్లేవు. నీ తాపత్రయామేగాని ఫలితం శూన్యం!

నీకిదంతా హాస్యాస్పదంగా కనిపించవచ్చు. హాస్యాల్ని అందరూ మెచ్చుకున్నప్పుడు నువ్వు దానికి భిన్నంగా ప్రవర్తించగూడదు. జీవితాల్ని ఆమూలాగ్రంగా అర్థంచేసుకుంటే గోచరించేది ఈ నగ్నసత్యమే! తరతరాలుగా వస్తున్న ఈ కుల, మతవ్యవస్థల ఆచారాలు దుర్గంధభూయిష్ఠమైనవని తెలిసిగూడా వివేకవంతులు ఏంచేశారు? కిమ్మనకుండా తమ జీవితాల్ని గడిపేశారు. ఈ సంగ్రామంలో దిగితే చివరికి మిగిలేది “మైనస్” సంఘం పురోగమించేదార్లో - అది పెడదారైనా సరే అడ్డంగా నిలబడతానంటే కాళ్ళక్రింద పడేసి త్రొక్కుకుంటూ మరీ నడిచి వెళుతుంది. ప్రయాసతప్ప - ప్రయోజనం శూన్యం! ఇవి వట్టి మాటలుగావు. మహానుభావుల జీవితానుభవాల చాటునవున్న నగ్నసత్యాలు.

ఇక నీ విషయానికి వద్దాం. “నిన్ను నమ్ముకున్న సరస్వతి ఏం చెయ్యమంటూ వన్నయ్యా?” అంటావు. నీవు చేసింది అసహజం కాదంటున్నాను. యువకత్వపు మత్తులో ఎవరైనా అలాగే చేసివుండేవాళ్లు. అందులో నీ దెంత భాగమో ఆమెదీ అంత భాగం వుంది. ముందు దోషం ఆరోపించబడేది స్త్రీమీద గాని పురుషుడిమీద

కాదు. ఎందుచేతనంటే మగాడికంటే ప్రకృతి బాధ్యతలు స్త్రీమీద ఎక్కువగా వున్నాయి. 'ఆమె నన్యాయంచేస్తే సంఘం ఒప్పుకుంటుందా?' అంటావు. అది అన్యాయం కాదంటుంది. సరస్వతి తల్లి చరిత్రను చూచి ఆమె శీలానికి సర్టిఫికెటు ఇస్తుంది. దాన్ని అధిగమించి మనం పోగూడదు.

నా ఆస్తిలో సగం భాగం నీకివ్వనందుకు నీకు కోపం వచ్చివుంటుంది. నేను నీకు నా స్వంత ఆస్తిలో సగంభాగ మిస్తున్నానంటే నువ్వుచేసిన పనిని హర్షిస్తున్నానన్న మాటేగా! నాకూ పిల్ల లున్నారు. వాళ్ళ భావిజీవితం చూడు. వాళ్ళ వంశం మంచిదికాదు అంటే ఇక తలయెత్తుకు తిరగ్గలరా?

నీ వీపాటికి జీవితాన్ని కొంతవరకైనా అర్థం చేసుకునే వుంటావు. నీ మనస్ఫూర్తిగా చెప్పు. నువ్వు బాధపడుతున్న దేమిటి? ఇట్లా జరిగినందుకు విచారించాల్సిన అవసరంలేదు. అది ఓ అనుభవం. జీవితానికి కనువిప్పు.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీవూ నేనూ ఒక్క తండ్రి బిడ్డలం కాకపోయె. మన మిద్దరిలోనూ నాన్న అమ్మల రక్తం వేరుపడి పోలేదు. నువ్వే నిమిషాన వస్తానన్నా అభ్యంతరం లేదు. కాని ఒక్క విషయం. నే చెప్పిన విష యాలకి ఒప్పుకోవాలి!"

సుందర్రావు రెండు నిమిషాలు జీవిత సింహావ లోకనం చేసుకున్నాడు. అన్నయ్య చెప్పినవన్నీ నగ్న సత్యాలు. తనిప్పుడేం చెయ్యాలి? అనేది ప్రశ్న.

తనింటికి వెళ్ళేప్పటికిగూడా ప్రొద్దున్న వెళ్ళిన రాజారావు తిరిగి ఇంటికి రాలేదు. అసలికను వాళ్ళ ఊరు వెళ్ళిపోయాడేమోనని అనుమానం కలిగిందతనికి. కాని తను స్నానంచేసి భోజనానికి కూర్చోబోయేసరికి రాజారావువచ్చాడు. రాజా రావును తనతోపాటు భోజనానికి కూర్చోబెట్టు కుని భోజనం చేశాడు. భోజనం చేస్తున్నంతసేపు అతని ఉత్సాహాన్ని చూచి సరస్వతీ-రాజారావూ ఆశ్చర్యపోయారు.

"ఇంటర్లో గాబోలు-తెలుగు మాస్టారి కుర్చీ క్రింద సీమటపాకాయ పెడితే ఆయన వచ్చి కూర్చుని టపాకాయ పేలేసరికి బ్రహ్మాండం బ్రద్దలయినంత పని చేశాడు. గుర్తుందిటరా? అన్నట్లు నువ్వేగా ఆ టపాకాయ పెట్టింది. ప్రక్కగదిలో కెళ్ళి చూస్తూ కూర్చున్నావు గూడా!" అన్నాడు సుందర్రావు రాజారావుని-నవ్వుతూ!

రాత్రి చాలాసేపటికిగాని ఎవ్వరూ పడుకో లేదు. పడుకున్నా ఎవ్వరికీ నిద్రపట్టలేదు. తెల్లవారు ఝామున రాజారావూ, సరస్వతి మాగన్నుగా నిద్రపోతున్నారు సుందర్రావు ఆలోచించాడు. "ఇప్పుడు నేను సరస్వతిని వదిలివెళితే? పాపం ఆమె జీవితం ఏమైపోతుంది?" ఆమె జీవితాన్ని గురించే ఆలోచిస్తే తన జీవితమో? సుందర్రావు మెల్లిగా లేచాడు. సరస్వతి ప్రక్కలో పాప అమాయికంగా నిద్దగపోతూవుంది. లేచి పసిపాపని ముద్దుపెట్టుకున్నాడు. మెల్లిగా అడుగులు వేసు కొంటూ బయటికి వచ్చాడు. ఆ గాఢ నిశీథిలో పడి ఎక్కడికో నడిచాడు సుందర్రావు.

తనని చూడగానే వదిన "సరస్వతి ఏది?" అంది. సుందర్రావు పందిరి మంచంమీద అటు వేపు తిరిగి పడుకున్నాడు. "ఆమెను గురించి నన్నేమీ అడక్కు వదినా. నేను పాపాన్నే చేశాను. సంఘం ఓ నిశ్చలంగా పారుతున్న నీరు. అడుగున ఎన్నెన్నో మలినాలు, కల్మషాలూ వుండవచ్చు. వాటిని బయటికి తీసి పారెయ్యాలని ప్రయత్నం చెయ్యటం ఈ పరిభాగపు నిశ్చల త్వాన్ని భంగంచేసి ఆ మలినాల్ని జలమంతా వ్యాపింప చెయ్యటమే అవుతుంది" సుందర్రావు ఇంక చెప్పలేకపోయాడు.

వదిన తన తలలోకి వేళ్లు పోనిచ్చి గోముగా రాచింది. ఆమె కళ్ళల్లోకి రెండశ్రువులు నిండు కొచ్చాయి. "అంతే బాబూ. ఆడజన్మకి విలువ ల్లేవు. సరస్వతి ప్రకృతి బానిస. ఇంతవరకూ నిన్ను నమ్ముకుంది. ఆమెను నువ్వు పోషించావు. ఇకనించీ ఇంకెవరికో దాస్యం చేస్తుంది. అలాగ ఎక్కడో అంతరించిపోతుంది. ఈ సంఘంలో ఆటివాళ్లెంతమంది వున్నారో! ఈ సృష్టికి అర్థంలేదు" అని వదిన నిట్టూర్చింది. నిజంగా అంతేనేమో!

(సమాప్తము) ★